క్లుప్తంగా

పేదల హృదయాల్లో సీఎం జగన్



మాదేపల్లిలో లబ్ధిదారుడి గృహ ప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల సాకారం చేసి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోయారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కొనియాడారు. శనివారం చాటపర్రు జగనన్నకాలనీలో పేదల కట్టుకున్న ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారుడు గండి బాలకృష్ణ దంపతుల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని బహుమతి అందజేశారు. లబ్ధిదారుడి ఇంటిపై సీఎం జగన్ చిత్రపటాన్ని ముద్రించాడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో లక్షలాది మంది పేదలకు సొంతిల్లు దక్కిందన్నారు. ఎమ్మెల్యే వెంట వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు, కోటేశ్వరపురం సర్పంచ్ వర్రీ లక్ష్మీదుర్గ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్ : మానసిక, శారీరక ఎదుగుదలకు ఆధ్యాత్మిక భావన ఎంతో అవసరమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండలం మొండికోడులో నిర్వహించిన శ్రీఅభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య అభయాంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ప్రజలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. శాలువ కప్పి సన్మానించారు. ఉదయం నుంచి పలువురు దంపతులు ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని హోమం, పూజలు చేశారు.

వైభవంగా బాల అయ్యప్ప క్షేత్రం వార్షికోత్సవం



బాల అయ్యప్ప స్వామి క్షేత్రంలో కోలాట బృందం సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక దొండపాడులోని శ్రీ బాల అయ్యప్ప క్షేత్రం 13వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు 11 రకాల ద్రవ్యాలతో స్వామి వారికి విశేష అభిషేకం చేసిన అనంతరం లక్ష్మీ గణపతి హోమం, ఉత్సవ పూర్ణాహుతి నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ, ప్రసాద వితరణ చేశారు. ఉదయం 10.30 గంటలకు నగరానికి చెందిన ప్రముఖ గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తి రంజని కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి పుష్పాలంకరణ, 11.30 గంటలకు శ్రీ బాల అయ్యప్ప కోలాట భజన బృందం కోలాట ప్రదర్శన, 12 గంటలకు అఖండ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, రాత్రి 8 గంటలకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.16 లక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పత్తేబాద నాలుగు గుడుల సెంటర్‌లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో శనివారం హుండీల ఆదాయన్ని లెక్కించారు. 91 రోజులకు రూ.1,16,912 ఆదాయం వచ్చింది. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీబోర్డు చైర్మన్ బీహెచ్ రమా నాగశంకర్, ట్రస్టీలు పాల్గొనగా, దేవదాయ శాఖ ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీ నరసింహరావు పర్యవేక్షించారు.

పెదపాడు సెంటర్‌లో పోలీస్ కవాతు

పెదపాడు: జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు మండలంలోని పెదపాడులో సీఆర్‌పీఎఫ్ పోలీసులతో పెదవేగి ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెదపాడు ఎస్సై శుభశేఖర, పోలీసు సిబ్బంది శనివారం కవాతు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సాయుధ దళాల పోలీసు సిబ్బందితో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు.

పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తాం

ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి పేదవాడికీ సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని, ఏలూరు నియోజకవర్గంలో ప్రతి పేదవాడికీ ఇల్లు కట్టించి ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏలూరు నగరంలోని పలు డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు శనివారం నాని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ చేతులమీదుగా రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి వర్గాలకు గూడు కల్పించాలనే ధ్యేయంతో పనిచేస్తున్నారని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు ఏం కావాలో వాటిని అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. ఏలూరులో 33 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయగా, ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కు పత్రాలను అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పేదలకు మేలు చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని చెప్పారు.

ఎమ్మెల్యే నానితోనే సంక్షేమం

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానితోనే ఏలూరు నియోజకవర్గంలో పేదలకు సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నగర అధ్యక్షుడు రియాజ్ ఆలీఖాన్ అన్నారు. ఏలూరు 46వ డివిజన్ 19వ సచివాలయంలో జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం శనివారం చేపట్టారు. కార్పొరేటర్ ఆయేషా సుల్తానా ఆధ్వర్యంలో డివిజన్‌లో సుమారుగా 364 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని, దశల వారీగా రిజిస్ట్రేషన్ చేసి పూర్తిహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నామని ఆలీఖాన్ చెప్పారు. ఎమ్మెల్యే నాని నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా కృషి చేయటంతో పాటు అందరికీ సొంతిల్లు ఇవ్వాలనే లక్ష్యంతో పని చేశారని తెలిపారు. చంద్రబాబు హయాంలో పేదలకు ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వలేదని, ఇప్పుడు సీఎం జగనన్న ఇస్తే కుటిల రాజకీయాలు చేస్తూ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి మరోసారి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు.



46వ డివిజన్‌లో లబ్ధిదారుకు ఇంటి పట్టా అందిస్తున్న రియాజ్ ఆలీఖాన్

బీసీలకు పూర్తి సహాయ సహకారాలు



విశ్వబ్రాహ్మణులకు స్థలం, నిధులు కేటాయిస్తూ లెటర్ ఇస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు (టూటౌన్): బీసీలు తన కుటుంబ సభ్యులని, అన్ని వేళల వారికి పూర్తి సహాయసహకారాలు అందజేస్తానని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. శ్రీ విరాట్ విశ్వకర్మ ఐక్యవేదిక పంచ వృత్తులు విశ్వబ్రాహ్మణులకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 800 గజాల స్థలం, రూ.25 లక్షల ప్రభుత్వ నిధులు కేటాయించి, దానికి సంబంధించిన లెటర్‌ను సంఘం నాయకులకు శనివారం ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో నాని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులంటే ప్రత్యేకమైన అభిమానం ఉందని సమాజానికి నాగరికత నేర్పిన చరిత్ర తమదేనని, కాలజ్ఞానం సృష్టికర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మం ఉద్భవించిన కులం విశ్వబ్రాహ్మణులని గుర్తుచేశారు. అటువంటి విశ్వబ్రాహ్మణులకు స్థలం, నిధులు కేటాయించడం సంతోషంగా ఉందని చెప్పారు. భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా తనను కలవాలని కోరారు. ఎమ్మెల్యే నానికి విశ్వబ్రాహ్మణులంతా కృతజ్ఞతలు తెలిపారు. ఏ రాజకీయ పార్టీ గతంలో తమకు ఇంతటి ప్రాధాన్యత ఇవ్వలేదని, గత ప్రభుత్వంలో ఎవ్వరూ ఇంత గొప్పగా చేయలేదని కొనియాడారు. నాని వెంటే నడుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి, రాష్ట్ర జ్యువెలరీ అసోసియేషన్ కన్వీనర్ కాదా రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కాదా బ్రహ్మాజీ, కార్పొరేటర్ గూడూరు హేమ దుర్గాప్రసాద్, శ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సింహాద్రి బ్రంగాచారి, కొత్తల శివ, కెల్లా దుర్గాప్రసాద్, మానేపల్లి నాగేశ్వరరావు, అద్దంకి సత్యనారాయణ, కడియం ప్రసాదు, నల్లవాటి కామేశ్వరం, ఏదిలాడ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికారతే లక్ష్యం





ఆర్యవైశ్యుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని, బాధితుడికి చెక్కు అందిస్తున్న నాని, సునీల్‌కుమార్

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సాధికారతే లక్ష్యంగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో శనివారం ఆర్యవైశ్యుల కమ్యూనిటీ హాల్ భవనం, తూర్పుకాపు సంఘీయుల విద్యావైజ్ఞానిక భవనం, గౌడ సంఘీయుల కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే నాని శంకుస్థాపనలు చేశారు. నియోజకవర్గంలోని సుమారు 21 సామాజిక వర్గాలకు ఇప్పటికే కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించి ఆర్థిక సాయం అందించారు. ఏలూరు లునానీనగర్‌లో 1000 గజాల స్థలంలో ఆర్యవైశ్యుల కమ్యూనిటీ హాల్ భవనానికి ఎమ్మెల్యే నాని శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజల సంక్షేమమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాసరావు, అధ్యక్షుడు దివ్వెల జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి వేమా వెంకట సురేష్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుల రవికుమార్, కోశాధికారి బచ్చు విష్ణు, పార్టీ జేసీఎస్ నగర అధ్యక్షులు మోటమర్రి సదానందకుమార్, తదితరులు ఉన్నారు.

- లునానీనగర్ బీడీకాలనీ గట్టురోడ్డులో ఏలూరు పట్టణ తూర్పుకాపు విద్య, విజ్ఞాన అభివృద్ధి సంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నాని శంకుస్థాపన చేసి మాట్లాడారు. తుర్పుకాపు సామాజికవర్గం సంక్షేమానికి, అభివృద్ధి సీఎం జగనన్న ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఏలూరు డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, పార్టీ క్లస్టర్-3 మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి, పార్టీ నాయకులు మజ్జి కాంతారావు, తదితరులు ఉన్నారు.
- లునానీనగర్‌లో గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నాని శంకుస్థాపన చేశారు. ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

జగన్‌తోనే పేదలకు ఆరోగ్య భరోసా

ఏలూరు టౌన్: పేద, మధ్యతరగతి వర్గాలకు ఆరోగ్య భరోసా సీఎం జగనన్నతోనే సాధ్యమని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌తో కలిసి నగరంలోని పలువురు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ సుమారు రూ.10.79 లక్షల చెక్కులను నాని అందజేశారు. టీడీపీ హయాంలో పేదలకు ప్రభుత్వ వైద్యం అందిన దాఖలాలు లేవని ఆరోపించారు. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్యరంగానికి జీవం పోశారని చెప్పారు. ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కళాశాల, బోధనాసుపత్రి ఏర్పాటులో ఆధునిక వైద్య చికిత్సలు, సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు దిరిశాల వరప్రసాదరావు, కార్పొరేటర్లు కలవకొల్లు సాంబ, గునుపూడి శ్రీనివాస్, ఆయా డివిజన్ల నాయకులు, బాధిత కుటుంబాలు ఉన్నారు.

సత్యవోలులో సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

పెదపాడు: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా భావించి ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్నారని ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి తెలిపారు. పెదపాడు మండలంలోని సత్యవోలులో బీసీ సెల్ అధ్యక్షుడు, ఏలూరు నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేసారు. రూ. 4 లక్షల జెడ్పీ నిధులతో చిన సత్యవోలు రామిలేరు గట్టుపై గ్రావెల్ రోడ్డు పనులను ప్రారంభించారు. రూ. 3.92కోట్లతో 11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసారు. రూ..20 లక్షల జీజీఎంపీ నిధులతో సీసీ డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, స్థానిక నాయకులు వైకుంఠపు ధనంజయ్, పెంకి శివ శ్రీనివాస్, సాధం కిశోర్ పాల్గొన్నారు.

జిల్లాలో 92 శాతం ఓటింగే లక్ష్యం



మాదేపల్లిలో కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న డీపీఓ శ్రీనివాస్

ఏలూరు రూరల్: రానున్న ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా ఓటింగ్ 92 శాతానికి పెంచడమే లక్ష్యమని డీపీఓ, స్వీప్ నోడల్ ఆఫీసర్ తూతిక శ్రీనివాస్ అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో ఉపాధి హామీ పథకం కూలీలకు ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వె ప్రసన్నవెంకటేష్ ఆదేశాల మేరకు ఓటింగ్ శాతం పెంచేందుకు ఓటర్స్ టర్న్ అవుట్ ప్రకారం స్వీప్ కార్యక్రమాలు చేపట్టామన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో 79.77 శాతం, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 83.75 శాతం పోలింగ్ నమోదైందని గుర్తుచేశారు. ఏలూరు నియోజకవర్గంలో అత్యల్పంగా 68.10 శాతం నమోదైందని చెప్పారు. దీనికి పట్టణ ప్రాంతాల్లో ఎగువ శ్రేణి, యువత ఓటింగ్‌కు దూరంగా ఉండడమే కారణమన్నారు. ప్రజలు ఓటు ప్రాధాన్యత తెలుసుకోవాలని కోరారు. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ బి.రాము మాట్లాడుతూ జిల్లాలోని 27 మండలాల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి, సుమారు 50 వేల కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.


పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థినికి పరీక్ష అట్ట, పెన్ను అందిస్తున్న అజయ్ బాబు

ఏలూరు (టూటౌన్): స్థానిక టైటస్ నగర్ ఐసీఎం స్కూల్‌లో పదో తరగతి విద్యార్థినులకు మానవత సంస్థ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష అట్టలు, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మానవత సంస్థ ఏలూరు అధ్యక్షుడు మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డు కాదని, ప్రతిభ ఉంటే ఏ స్థాయి కన్నా చదువుతో సాధించవచ్చని అన్నారు. కష్టపడి ఇష్టంతో ప్రతి విద్యార్థీ చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని అయ్యప్ప బుక్‌స్టాల్ అధినేత కంచర్ల శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో రమాదేవి, వినుకొండ మోషే, రాణి,స్వామి, బ్యూలా, నాగేశ్వరమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన రామకోటి మహోత్సవాలు



రామకోటి ఉత్సవ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22న ప్రారంభమైన 92వ శ్రీ రామకోటి మహోత్సవాలు శనివారం ముగిశాయి. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులచే మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఉదయం 10 గంటలకు ఉత్సవ మహాపూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు నగరానికి చెందిన గజవెల్లి జోగారావు శ్రీరామచరిత గానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు కైకలూరుకు చెందిన ఘంటసాల బసవయ్య ఆధ్వర్యంలో ఘంటసాల భక్తి రంజని పేరిట సంగీత కచేరి నిర్వహించారు. రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన ది వెంకట్రాయ నాట్య బృందం ఆధ్వర్యంలో నాట్యాచారిణి నీలి శర్వాణి శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దివాకరుని శ్రీ వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పొట్టి శ్రీరాములు త్యాగం స్ఫూర్తిదాయకం



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం యువతకు స్ఫూర్తిదాయకమని ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మోటమర్రి సదానంద కుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక వసంతమహల్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సదానందకుమార్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని నిజమైన ఆమరణ నిరాహార దీక్ష చేశారని, దురదృష్టవశాత్తు ప్రత్యేక రాష్ట్రం ఆయన మరణానంతరం లభించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చలువాది శివకృష్ణ బ్రహ్మయ్య, కోశాధికారి నున్న శ్రీనివాస్, కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్, నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు గుడివాడ రామచంద్ర కిషోర్, బచ్చు మురళి, ఒంటిమిల్లి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత

పెదవేగి : అభివృద్ధితోపాటు సంక్షేమానికి సమాన ప్రాధాన్య ఇస్తున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో పర్యటించిన శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. ముందుగా గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను అబ్బయ్యచౌదరి పరిశీలించారు. పాదయాత్రగా జోసెఫ్ నగర్‌లో పర్యటించి ప్రజలను పరామర్శించారు. స్థానిక సచివాలయం వద్దకు చేరుకుని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అంకన్నగూడెంలో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ పాఠశాల భవనానికి స్థానిక సర్పంచ్ దుక్కిపాటి మహాలక్ష్మీడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. స్థానిక అంగన్‌వాడీ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి, చిన్నారులకు భోజనం వడ్డించారు. బి సింగవరంలో రూ.60 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ఘనస్వాగతం పలికారు.

కార్మికుల సంక్షేమానికి కృషి



కార్మికులకు యూనిఫామ్, గ్లౌజులు అందిస్తున్న పెదబాబు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ పారిశుద్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఏలూరు కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద శనివారం ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు 400 మందికి గుర్తింపు కార్డులు, రాత్రిపూట ధరించేలా రేడియం యాప్రాన్స్, షూ, చేతిగ్లౌజులు తదితర వస్తువులు అందజేశారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు, సాధారణ మరణానికి రూ.2 లక్షలు కుటుంబ సభ్యులకు అందించేలా సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ మాలతి, మేనేజర్ మూర్తి తదితరులు ఉన్నారు.